క్లుప్తంగా

చల్లపల్లి నుంచి ఉత్తర చిరువోలులంకకు బస్ సర్వీస్



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): కొంతకాలంగా నిలిచిపోయిన చల్లపల్లి నుంచి ఉత్తరచిరువోలులంక బస్ సర్వీస్‌ను మంగళవారం పునరుద్ధరించారు. ఈ సర్వీస్ జీ ఆర్టీసీ కొంతకాలంగా నడపడం లేదు. దీనిపై పలు సంధర్భాల్లో ప్రజలు ఆర్టీసీ అధికారుల దృష్టికి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఐదు గ్రామ పంచాయతీల్లోని విద్యార్థుల చదువుకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే మండలి సూచించారు. దీంతో ఉత్తరచిరువోలులంక నుంచి చల్లపల్లికి ప్రతి రోజూ ఉదయం 7.30 గంటలకు, సాయంత్రం చల్లపల్లి నుంచి ఉత్తర చిరువోలులంకకు 5.30 గంటలకు బస్ సర్వీస్‌ను పునరుద్ధరించినట్లు ఆర్టీసీ డీపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు.

కలెక్టరేట్ ఏవోగా రాధిక



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ పరిపాలనాధికారిగా ఏఎస్ఎన్ రాధిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏవోగా సీహెచ్ వీరాంజనేయప్రసాద్ పనిచేశారు. ఆయనను నాగాయలంక తహసీల్దార్‌గా బదిలీ చేయడంతో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఏఎస్ఎన్ రాధికను ఏవోగా కలెక్టర్ డీకే బాలాజీ నియమించారు. కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మకు మొక్కలను అందజేసి అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

నూతన కమిటీ సభ్యులకు అభినందన



అవనిగడ్డ: నూతన కమిటీలకు ఎంపికైన పలువురు నేతలను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అభినందించారు. అవనిగడ్డ మండల ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గార్లపాటి గోపాలకృష్ణ (గోపీ), బొర్రా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చింతలపూడి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు నాయకులు మాజీ ఎమ్మెల్యే సింహాద్రిని మంగళవారం పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవగా వారిని రమేష్‌బాబు అభినందించారు.

నాణ్యతతో పాఠశాల ప్రహరీ నిర్మాణం



ఘంటసాల: ప్రభుత్వ పాఠశాల ప్రహరీని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాల పెద్దగూడెంలో రూ.2.50 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను ఎంపీడీవో సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, ప్రహరీ నిర్మాణానికి ఎంపీటీసీ దిరిశం వెంకటలక్ష్మి కోరగా ఎంపీపీ వేమూరి రజనీకుమారి, పాలకవర్గం సభ్యుల ఆమోదంతో రూ.2.50 లక్షలు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వేమూరి ప్రవీణ్, వేమూరి రత్నశేఖర్, దిరిశం పిచ్చేశ్వరరావు ఉన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ఖరీఫ్‌కు సబ్సిడీపై వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి తెలిపారు. కొక్కిలిగడ్డ, కె. కొత్తపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ గ్రామ సచివాలయాల వద్ద ప్రభుత్వం సబ్సిడీపై అందించే వరివిత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు దిడ్ల జానకీ రాంబాబు, దొప్పలపూడి గంగాభవానీ, ఉద్యానశాఖ అధికారి రమేష్, బాలాజీ పలువురు రైతులు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలోని 13 సేవా కేంద్రాలకు సంబంధించి 40 క్వింటాళ్ల జీలుగ విత్తనాలతో పాటు 5204 బీపీటీ రకం విత్తనాలు 380 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏఓ శ్రీధర్ చెప్పారు. బీపీటీ రకం వరివిత్తనాలు కేజీ రూ.43 కాగా రూ.5 సబ్సిడీ పోగా రూ.38కి రైతుకు అందించనున్నట్లు తెలిపారు. 25 కేజీల 5204 బీపీటీ రకం విత్తనాలను రూ.950కు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని ఏఓ చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో స్థానిక కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

ఎవరి లెక్కలు వారివే!

- కేఈబీ కెనాల్‌లో ఉపాధి పనులు
- ఇరిగేషన్ శాఖ ద్వారా పనులు



కోడూరు ప్రధాన పంట కాలువలో ఫొటో దిగుతున్న ఉపాధి కూలీలు

అవనిగడ్డ: నియోజకవర్గంలో పంట కాలువకు చేస్తున్న పనులు విమర్శలకు దారి తీస్తున్నాయి. గతంలో అశ్వరావుపాలెం, మందపాకల కాలువకు ఉపాధి హామీ పథకం కూలీలు పనులు జరగగా, అదే పనులను ఇరిగేషన్ ఆధ్వర్యంలో చేశారు. ఇలా ఒకే చోట రెండు పనులు చేయడంతో లక్షలాది రూపాయల నిధులు నీటిపాలవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అటు ఇరిగేషన్.. ఇటు ఉపాధి పనులు

అవనిగడ్డ నియోజకవర్గంలో కేఈబీ కెనాల్‌తో పాటు అన్ని సాగునీటి సంఘాల పరిధిలో పంట కాలువలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు కోసం రూ.2.25 కోట్లు ఎస్‌డీఎంఎఫ్ నిధులు మంజూరు చేశారు. ప్రధాన పంట కాలువల్లో పూడికతీత పనులను ఇరిగేషన్ శాఖ పొక్లెయిన్‌తో చేయగా, అవే పనులను ఉపాధి కూలీలు చేశారు. ఇలా ఒకే పనికి రెండు బిల్లులు చేయడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ లాకుల నుంచి కోడూరు కాలువకు రెండు రోజులుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. రోజుకు వందమంది ఈ పనులు చేస్తున్నారు. ఈనెల 27వ తేదీన పులిగడ్డ వద్ద పంట కాలువకు సాగునీరు విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇంకా చాలా చోట్ల పనులు పూర్తి కాలేదు. నీరు వదిలిన తర్వాత చేయకుండానే పనులు చేసినట్టు చూపించుకుంటారేమో అనే సంశయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం నిధులు విడుదలైనా పనులు చేయకుండా జాప్యం చేయడం వెనుక మర్మమేమిటో కాంట్రాక్టర్లు అధికారులకే తెలుసని కొంతమంది రైతులు విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ జేబులు నింపడానికే ఈ నిధులు పనికొస్తాయని, మాకు న్యాయం జరగడానికి కాదని కొంతమంది రైతులు వాపోయారు. పంటకాలువలో వంద మందికి పైగా పనులు చేస్తున్న విషయాన్ని ఉపాధి హామీ పథకం ఏపీవో రవికుమార్‌ని వివరణ కోరగా ఐదారుగు మాత్రమే పనులు చేస్తున్నారని చెప్పడం కొసమెరుపు.

లెవలింగ్ పేరుతో అక్రమ అమ్మకాలు

- ప్రమాదకరంగా మారిన చెరువు
- అడ్డుకున్న ఉత్తరచిరువోలులంక సర్పంచ్ చింతా శ్రీనివాసరావు



ఉత్తరచిరువోలులంకలో తవ్వకాలను అడ్డుకున్న సర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): భూమి లెవలింగ్ పేరుతో అనుమతులు పొందిన వ్యక్తి చెరువును తలదన్నేలా తవ్వకాలు చేపట్టి మట్టిని విక్రయిస్తున్నారని ఉత్తరచిరువోలులంక సర్పంచ్ చింతా శ్రీనివాసరావు మంగళవారం వారిని అడ్డుకున్నారు. తాత్కాలిక అనుమతులు పొంది, చాలా లోతుగా తవ్వి మట్టి విక్రయాలు జరుపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో చుట్టుపక్కల రైతులకు చెందిన పొలాల గట్లు, మదింపు మార్కులు మాయమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మట్టి అమ్మకాలతో చుట్టు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రోడ్లు పాడవుతున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత బడే గౌతమ్ మాట్లాడుతూ మట్టిని ఎక్కడకు తరలిస్తున్నారనే సమాచారాన్ని ట్రాకింగ్ చేయాలని అనుమతికి మించిన మట్టిని తీస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గనులశాఖ అధికారులను కోరారు. తక్షణమే తవ్వకాలు నిలిపివేయాలని, రైతులకు సరైన పరిరక్షణ కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు. ఇదేవిషయమై స్థానిక తహసీల్దార్ శ్రీవిద్యను వివవణ కోరగా ఈ తవ్వకాలపై మైనింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు ఈ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారన్నారు. వారు ఇచ్చిన రిపోర్టు మేరకు చర్యలు ఉంటాయని వివరించారు.

మట్టి మాఫియాను అరికట్టాలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు

మోపిదేవి: మండలంలో మట్టిమాఫియా పెరిగిపోయిందని, వెంటనే అరికట్టాలని కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతుండగా కొక్కిలిగడ్డ సర్పంచ్ రాంబాబు కల్పించుకుని మండలంలో మట్టి మాఫియా పెరిగిపోయిందన్నారు. రేషన్ కోసం బండికోళ్లంక నుంచి కొక్కిలిగడ్డలోని రేషన్ షాపునకు వృద్ధులు, మహిళలు వెళ్లలేకపోతున్నారని వెంటనే దగ్గరలో అందరికీ రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన కొక్కిలిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఎస్ చెప్పే ఉపాధ్యాయులు లేరని వెంటనే ఆ పోస్టు భర్తీ చేయాలని ఎంఈవోను కోరారు. మోపిదేవి పీహెచ్‌సీ భవనంపై అదనపు గదుల నిర్మాణం నిలిచిపోవడాన్ని ఎంపీపీ దుర్గావాణి గుర్తుచేస్తూ ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. శాఖల వారీగా అధికారులు నివేదికలను వివరించారు. ఎంపీడీవో స్వర్ణభారతి, వైస్‌ఎంపీపీ నడకుదుటి జననీ కుమారి, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, తహసీల్దార్ శ్రీవిద్య, ఏవో పాండు రంగారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయ ఉద్యోగులు !



పెదతుమ్మిడి సచివాలయంలో ఇలా

బంటుమిల్లి: మండల పరిధిలో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. మంగళవారం 'సాక్షి' పెదతుమ్మిడి, ఆముదాలపల్లి, మల్లపరాజుగూడెం గ్రామాల్లోని సచివాలయాలను సందర్శిస్తే ఒకరిద్దరు మినహా మిగిలిన సిబ్బంది అంత గైర్హాజరయ్యారు. పెదతుమ్మిడి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు తప్ప ఎవరూ హాజరు కాలేదు. ఆముదాలపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు, ఏఎస్ఎం, వీఆర్వో తప్ప మిగిలిన సిబ్బంది ఎవరూ కనిపించలేదు. మల్లపరాజుగూడెం సచివాలయంలో ఏఎస్ఎం, వీఆర్వో తప్ప మిగిలినవారు విధులకు రాలేదు. సచివాలయ సిబ్బందిలో ఒక్క సర్వే సిబ్బందిని భూ సర్వే నిమిత్తం డెప్యుటేషన్ వేశారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు బదిలీ ప్రక్రియ మొదలు పెట్టడంతోపాటు క్లస్టర్ విధానాన్ని అమలులోకి తెచ్చే క్రమంలో ఉద్యోగులు ఎవరూ ఆ పేరుతో అందుబాటులో ఉండటంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది ఎక్కడికి వెళుతున్నది ఫీల్డ్ రిజిస్టరులో రాయాలి, అదీ ఫీల్డ్ సిబ్బందికి మాత్రమే వర్తిస్తుంది. మిగిలినవారు ఎవరు ఎక్కడికి వెళ్లాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. దీనిపై ఎంపీడీఓ నీరజాక్షి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందరూ విధులకు హాజరు అవుతున్నారని బదిలీలతోపాటు ఇతర పనులు నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తున్నారని సమర్థించుకున్నారు.

చిరుజల్లులు కురిసే వేళ.. నయనానందకరం



చల్లపల్లి గంగులవారిపాలెం ప్రధాన రహదారిలో సోయగాలతో ఆకట్టుకుంటున్న పూల మొక్కలు



కనువిందు చేస్తున్న నెమలి పుష్పాలు

ఈ దృశ్యాలు అందమైన ప్రకృతి చిత్రాలు అనుకుంటే పొరబడినట్లే. ఇవి స్వచ్ఛ సుందర చల్లపల్లిలోని గంగులవారిపాలెం(దళితవాడకు) వెళ్లే ప్రధాన మార్గం. రోడ్డుకు రెండు వైపులా ఉన్న పీకాక్ ఫ్లవర్స్(నెమలిపువ్వు), రెడ్‌బర్డ్స్ ఆఫ్ ప్యారడైజ్(స్వర్గపు ఎర్రపక్షులు) అని పిలిచే సీసల్పినియా పుల్చెర్రిమా జాతికి చెందిన ఈ పచ్చని మొక్కలు విరబూసి పూలతో నయనానందాన్ని కలిగిస్తున్నాయి. పసుపు, ఎరుపు, ఆరంజ్ రంగుల్లో వికసించిన పూలు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. ఈ విరుల అందాలకు పులకించిన ఆకాశం తన ఆనందాన్ని చిరుజల్లుల రూపంలో కురిపించిందేమో. ఆ చినుకులు నెమలి నాట్యం చేస్తున్నట్లుగా పువ్వులపై నిలిచి కదులుతూ ముత్యాల్లా దర్శనమిస్తూ ప్రకృతి ప్రేమికులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతూ కట్టిపడేస్తున్నాయి. ఈ పూల సోయగాలను ఆస్వాదించేందుకు సాయంత్రం వేళల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో నిత్యం వస్తుండటం విశేషం.

– చల్లపల్లి

రేపు గురుకులంలో 'ఇంటర్' ప్రవేశానికి కౌన్సెలింగ్

పెడన: గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో చేరడానికి ఎంట్రన్స్ ఎగ్జామ్ రాసి సీటు రాని వారికి ఈ నెల 26న జి.కొండూరు కుంటముక్కల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని బల్లిపర్రు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన మండల పరిధిలోని బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంఈసీ ఫస్ట్ ఇయర్‌లో చేరడానికి ఖాళీగా ఉన్న సీట్లను ఈ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తారని వివరంచారు. బల్లిపర్రు గురుకులంలో చేరాలనుకునే విద్యార్థినిలు ఈ 26న ఉదయం 9 గంటలకు కుంటముక్కల గురుకుల పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

కాకర్లమూడి పాలెంలో ఆధార్ ప్రత్యేక శిబిరం

పెడన: కాకర్లమూడి పాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎ.అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో రెండు ఆధార్ నమోదు మిషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరుగురి సిబ్బందితో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు శిబిరం ఉంటుందని, ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన వారు, ఫోన్ నంబర్ లింకు, కొత్తగా ఆధార్ నమోదు చేస్తారని వివరించారు.

చల్లపల్లి ఆటోనగర్‌లో ఇసుక అక్రమ నిల్వలు



చల్లపల్లి: ఇసుక అక్రమంగా నిల్వ చేసుకుని అమ్ముకునేందుకు చల్లపల్లి ఆటోనగర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ ప్రాంతంలో సులువుగా రాకపోకలు సాగించుకునేందుకు అన్ని వైపులా తారు రోడ్లు ఉండటంతో అనువుగా మారింది. టిప్పర్లతో ఇసుకను తీసుకువచ్చి ఆటోనగర్‌లో ఖాళీ ఉన్నచోటల్లా డంపింగ్ చేస్తూ కుప్పలుగా పేర్చి పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారు. ఇలా నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్లలో చుట్టుపక్కల ప్రాంతాలకు సరఫరా చేస్తూ అందినకాడికి డబ్బులు దండుకుంటున్నారు. ఈ పనులకు జేసీబీలను ఉపయోగించటంతో వాటి కారణంగా రోడ్లు పాడైపోతున్నాయి. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ప్రాంతంలో అక్రమ నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా మెగా డీఎస్సీ

పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి 117 మంది హాజరయ్యారని, 63 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 152 మందికి 77 మంది హాజరయ్యారని, 75 మంది గైర్హాజరయ్యారన్నారు.

కష్టపడితే విజయం, గుర్తింపు



బంటుమిల్లి: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే మంచి ఫలితంతోపాటు సమాజంలో గుర్తింపు లభిస్తుందని విశ్రాంత జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి(డీవీఈఓ) మట్టా రాధాకృష్ణమూర్తి(ఎంఆర్‌కేఎం) అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం 2024–25 ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మందపాటి జ్యోతి అధ్యక్షత వహించారు. ఎంఆర్‌కేఎం ఏటా తన తల్లిదండ్రులు మట్టా నారాయణమ్మ, వీరస్వామి పేరు మీద ఇంటర్ మొదటి, రెండో సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు రూ. 10 వేల నగదు బహుమతులు అందజేసి అభినందిస్తారు. ఇందులో భాగంగా మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎం. రాధాకృష్ణమూర్తిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

అవనిగడ్డ: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మండల కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామక వివరాలను వెల్లడించింది.

- **కోడూరు మండలంలో..**

ఉపాధ్యక్షులుగా మాలె నరేష్, చిలకలపూడి ధర్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా తండు వెంకట కృష్ణారావు, విశ్వనాధుని సత్యనారాయణ, పెద్ది మస్తాన్‌రావు, దేవనబోయిన ప్రసాద్, కార్యదర్శులుగా అప్పికట్ల చలపతి, పరసాబత్తిన యాకోబు, గుడివాక రామ్మోహనరావు, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, సైకం అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 28 మందిని నియమించారు.

- **మోపిదేవి మండలంలో..**

ఉపాధ్యక్షులుగా కారుమూరి శివనాగరాజు, పురిటిగడ్డ రాజాబాబు, ప్రధాన కార్యదర్శులుగా గొరిపర్తి గోవిందరాజులు, మోటుపల్లి రెడ్డిమ్మ, తండు వెంకటేశ్వరరావు, మత్తి వెంకట సత్యనారాయణ, కార్యదర్శులుగా నాలి శివరామకృష్ణ, మెరకనపల్లి కృష్ణయ్య, నడకుదిటి వీరబ్రహ్మం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 13 మందిని నియమించారు.

- **చల్లపల్లి మండలంలో..**

వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల ఉపాధ్యక్షులుగా మోతుకూరి ఏడుకొండలు, కొమ్ము డేవిడ్, ప్రధాన కార్యదర్శులుగా పేరం నాగిరెడ్డి, గొరిపర్తి శ్రీనివాసరావు, మోదుమూడి కుటుంబరావు, పాగోలు సీతారామారావు, కార్యదర్శులుగా గుర్రం దుర్గాప్రసాద్, కొల్లూరు మధుకృష్ణ, పేరే శివరామ్, పాగోలు సాయి, అల్లూరి నాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 16 మందిని నియమించారు.

- **ఘంటసాల మండలంలో..**

ఉపాధ్యక్షులుగా తిరుమలశెట్టి సీతారాంబాబు, పడమటి వీరకుమార్, ప్రధాన కారదర్శులుగా కుంపటి శరత్‌బాబు, చిట్టూరి రవికుమార్, మాడెం నాగరాజు, వేమూరి రత్నశేఖర్, కార్యదర్శులుగా అంగడాల నాగరాజు, చందోలు సత్యం, కొడాలి కిశోర్, దేవినేని విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా 23 మందిని నియమించారు.

గర్భిణులు, బాలింతలకు 'కిల్కారి కాల్స్' ప్రయోజనకరం



అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, డాక్టర్ తోట వీరేంద్రనాథ్

మచిలీపట్నంఅర్బన్: గర్భిణులు, బాలింతలకు కిల్కారి కాల్స్ సేవలు ప్రయోజనకరమని కిల్కారి కాల్స్ సర్వీస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు అన్నారు. నారాయణపురంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో కిల్కారి కాల్స్ సేవలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణీ, బాలింతల కోసం ప్రవేశ పెట్టిందన్నారు. కిల్కారి కాల్స్ సర్వీసులు గర్భందాల్చినప్పటి నుంచి పిల్లలకు ఏడాది వయసు వచ్చే వరకు, గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని అందించే మొబైల్ ఆధారిత సేవన్నారు. ఇది వారానికొక సారి, దశలవారీగా, ముందే రికార్డ్ చేసిన సందేశాలను నేరుగా కుటుంబాల మొబైల్ ఫోన్‌లకు పంపుతుందన్నారు. మాత, శిశు మరణాలను తగ్గించటానికి ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్స్ నంబర్ 01244451660 గర్భిణులు, బాలింతలు మొబైల్లో సేవ్ చేసుకుని కాల్ వచ్చినపుడు సమాచారాన్ని పూర్తిగా తెలుసుకోవచ్చన్నారు. సమాచారాన్ని తిరిగి వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నెంబరుకు డయల్ చేసి వినవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తోట వీరేంద్రనాథ్, ఎంపీహెచ్ఏ ప్రవీణ్ కుమార్, ఆశాలు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో బల్లిపర్రు, చల్లపల్లి విద్యార్థినులకు సీట్లు



జుజ్జవరపు అఖిల



పట్టిక ఇందూప్రియ



బత్తుల బ్యూలా పాలవెల్లి



గాలి శశికళ



కూనపరెడ్డి సాయికీర్తి

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు పొందిన ఇద్దరు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జుజ్జవరపు అఖిల 571 మార్కులు సాధించి ఇడుపులపాయ ఆర్కే వాలీలోను, పట్టిక ఇందూప్రియ 570 మార్కులతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని పేర్కొన్నారు. వీరిద్దరినీ తనతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారని ఆమె తెలిపారు.

చల్లపల్లి నుంచి..

చల్లపల్లి: ట్రిపుల్ ఐటీకి చల్లపల్లి మండలం నుంచి ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'పది' చదివిన బత్తుల బ్యూలా పాలవెల్లి(575 మార్కులు)కి ఆర్‌కె వ్యాలీలో, ఇదే స్కూల్లో చదివిన మరో విద్యార్థిని గాలి శశికళ(574)కి నూజివీడులో, మండల పరిధిలోని కొత్తమాజేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన కూనపరెడ్డి సాయికీర్తి(574)కి ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో సీట్లు లభించాయి. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీ అరికట్టాలి



డీఈఓ రామారావుకు ఫిర్యాదు చేస్తున్న పేట్రియాటిక్ డెమోక్రటిక్ మూవ్మెంట్ సభ్యులు

మచిలీపట్నంఅర్బన్: స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు స్టేషనరీ, పుస్తకాలు, యూనిఫాం అమ్ముతూ చేస్తున్న దోపిడీని అరికట్టాలని పేట్రియాటిక్, డెమోక్రటిక్ మూమ్‌మెంట్ జిల్లా కన్వీనర్ ఎన్.అరవింద్ కుమార్ కోరారు. అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం డీఈఓ పీవీజే రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు లాభాలు పొందేందుకు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ అమ్మకాల కోసం వివిధ పద్ధతులు అవలంబిస్తున్నాయన్నారు. వాట్సాప్ సందేశాలతో తల్లిదండ్రులకు ప్రత్యేకంగా మార్గనిర్దేశం చేసి, తమకు అనుకూలంగా ఉండే దుకాణాలకు వెళ్లాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. కొన్ని పాఠశాలలు బయట ఏర్పాటు చేసిన దుకాణాల్లో అమ్మకాలు చేస్తుంటే, మరికొన్ని నేరుగా పాఠశాల ప్రాంగణాల్లోనే విక్రయిస్తున్నాయన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో శంకర్, నాగబాబు, రామకృష్ణ, నాగరాజు, శ్రీరామ్ శర్మ, మహంకాళి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ సేవలపై అవగాహన అవసరం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుల కమిషన్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. నగరంలోని వినియోగదారుల కమిషన్ భవనంలోని మొదటి అంతస్తులో రూ. 20 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన మధ్యవర్తిత్వ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వస్తువును కొనుగోలు చేసి మోసపోతే వినియోగదారుల కమిషన్‌లో న్యాయం జరుగుతుందనే అంశంపై అవగాహన పెంచాలన్నారు. మచిలీపట్నంలోని కోర్టు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటికి సదుపాయాలు కల్పించడంతో పాటు సుప్రీం, హైకోర్టు తీర్పులు తెలుసుకునేలా డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు నందిపాటి పద్మారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల కమిషన్ ద్వారా 90 రోజుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో ముడా చైర్‌పర్సన్ మట్టా ప్రసాద్, ఏపీ స్టేట్ కన్స్యూమర్ కమిషన్ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శిరోభూషణం శ్రీనివాస్, విజయవాడ కన్స్యూమర్ ఫోరం కమిషన్ చైర్మన్ ఎస్ చిరంజీవి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.